# బాప్తిస్మమందు జరుగు మార్పులు

> ''మీరు పాపమునకు దాసులై యుంటిరిగాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగా లోబడినవారై, పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి; ఇందుకు దేవునికి స్తోత్రము'' (రోమా 6:17, 18).

మనం బాప్తిస్మం పొందేటప్పుడు, బాప్తిస్మంతో జత కూడియున్న ఆత్మ సంబంధమైన వాస్తవాలను మనం గ్రహించినవారమై ఉండాలి. మనం బాప్తిస్మం పొందినప్పుడు హృదయపూర్వకంగా ఆత్మ నిష్ఠతో దానిలో పాలు పొందినట్టయితే, నాలుగు ముఖ్యమైన మార్పులు జరుగుతాయి.

## స్థితి యొక్క మార్పు

బాప్తిస్మానికి రావడంలో, మన పాపక్షమాపణకుగాను తన మరణమందు ఆయన రక్తాన్ని ధారబోసిన మెస్సీయాయగు యేసుక్రీస్తునందలి విశ్వాసంతో చేరాలి. ఆయనను మన ప్రభువుగా అంగీకరించడానికిగాను మన గత జీవితాన్ని వదలుకొనడానికి తీర్మానం చేసికొనియుండాలి. మనం దీన్ని జరిగించినప్పుడు, ఆయన మన స్థితిని: (1) నశించిన దానిలోనుండి రక్షింపబడిన దానిలోనికిని (మార్కు 16:16; 1 పేతురు 3:21), (2) పాప భరితమైన స్థితినుండి పాపములు కడగబడిన స్థితిలోనికిని (అపొ. 22:16), మరియు (3) దోష భరితమైన స్థితినుండి మన పాపములు క్షమింపబడిన స్థితిలోనికి మార్పు చేస్తాడు (అపొ. 2:38; కొలస్సీ. 2:12, 13). ఇవి మూడు భిన్నమైన మార్పులు కావు. ఒక మార్పుకు సూచన మాత్రమే. తన పాపములు యేసు రక్తముచే కడగబడి ఒక క్రైస్తవేతరుడు క్రైస్తవుడైనప్పుడు ఈ మార్పు జరుగుతుంది.

## స్థానము యొక్క మార్పు

బాప్తిస్మం పొందినప్పుడు మనలను మనం ఆత్మీయంగా లోబరచుకొంటే, ప్రభువైన యేసుకు వెలుపల ఉండం – అంతకు పూర్వం దూరస్థులుగా ఉన్న మాట వాస్తవమే. ఎఫెసీలోని క్రైస్తవులతో పౌలు యిలా అన్నాడు, ''ఆ కాలమందు ఇశ్రాయేలుతో సహపౌరులుకాక, పరదేశులును, వాగ్దాన నిబంధనలు లేని పర జనులును, నిరీక్షణలేనివారును, లోకమందు దేవుడులేనివారునైయుండి, క్రీస్తుకు దూరస్థులైయుంటిరని మీరు జ్ఞాపకము చేసికొనుడి'' (ఎఫెసీ. 2:12).

క్రైస్తవులు అవడంతో, మన స్థానం మారుతుంది – ఎందుకంటే మనం క్రీస్తులోనికి ప్రవేశిస్తాం

అక్కడ క్రీస్తు రక్తంవలన మనం దేవుని సన్నిధికి తేబడతాం (ఎఫెసీ. 2:11-13). క్రీస్తుకు వెలుపల స్థానంనుండి ఆయనలో ఉండేలా మార్పు చెందినందువలన (రోమా 6:3; గలతీ. 3:27), క్రీస్తు రక్తంవలన సాధ్యం చేయబడిన ఆశీర్వాదాలలోనికి మనం ప్రవేశిస్తాం. ''ఆ ప్రియునియందు ఆయన రక్తంవలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ'' కలిగియున్నది (ఎఫెసీ. 1:7; కొలస్సీ. 1:14). క్రీస్తునందలి మనం నూతన సృష్టిగా (జీవులుగా) చేయబడ్డాం (2 కొరింథీ. 5:17), కృపలోనికి ప్రవేశం లభించింది (ఎఫెసీ. 1:6; 2 తిమోతి 2:1), రక్షణ పొందాం (2 తిమోతి 2:10), నిత్య జీవాన్ని అనుభవిస్తాం (1 యోహాను 5:11), మరియు ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదానికి మనకు ప్రవేశం లభిస్తుంది (ఎఫెసీ. 1:3).

క్రీస్తులోనికి బాప్తిస్మం పొందడంవలన, ఆయనయందున్న ఒకే శరీరంలో (రోమా 12:5), అంటే క్రీస్తు శరీరంలోనికి ప్రవేశిస్తాం (1 కొరింథీ. 12:27), అది ఆయన సంఘమే (ఎఫెసీ. 1:22, 23; 5:30; కొలస్సీ. 1:18, 24; 3:15). సంఘమను ఆ శరీరానికి క్రీస్తు రక్షకుడైయున్నాడు (ఎఫెసీ. 5:23), మనం బాప్తిస్మం పొందినప్పుడు అందులో ప్రవేశిస్తాం (1 కొరింథీ. 12:13).

ఆ సంఘములో ఉన్నవారు పరలోకమందు ''వ్రాయబడియున్నారు'' (హెబ్రీ. 12:23). అంటే, మనం పరలోకానికి వెళ్తాం ఎందుకంటే మన పేర్లు జీవ గ్రంథమందు వ్రాయబడి ఉంటాయి (ప్రకటన 21:27). ఆ గ్రంథంలోనుండి మన పేర్లు తుడుపు పెట్టబడకుండేలా మనం జయించాలి (ప్రకటన 3:5). మన పేర్లు జీవ గ్రంథంలో లేకుంటే, అగ్ని గుండములోనికి పడవేయబడతాం (ప్రకటన 20:15). సంఘం యొక్క సభ్యులుగా మనం సంపూర్ణులంగా చేయబడతాం (హెబ్రీ. 12:23), ''వాక్యమను ఉదక స్నానముచేత'' కళంకమైనను ముడుతయైనను అట్టిది మరేదైనను లేక ఆ సంఘం చేయబడుతుంది (ఎఫెసీ. 5:26). మనం ప్రభువుకు నిష్కళంకులంగా యివ్వబడతాం (ఎఫెసీ. 5:27; కొలస్సీ. 1:19-23).

సంఘము ''నిశ్చలమైన'' (హెబ్రీ. 12:28) క్రీస్తు యొక్క రాజ్యమైయుంది (మత్తయి 16:18, 19); రాజ్యం యొక్క సభ్యులు రాజ్యముయొక్క కుమారులు క్రీస్తుయొక్కయు, తండ్రియొక్కయు నిత్య రాజ్యంలో సూర్యునివలె ప్రకాశింతురు (మత్తయి 13:37-43; 2 పేతురు 1:10, 11). నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించడంవలన మనం దేవుని రాజ్యంలో ప్రవేశిస్తాం (యోహాను 3:3-5).

సంఘ సభ్యులు దేవుని యింటివారు, ఆయన కుటుంబం (1 తిమోతి 3:15). మనము దేవుని పిల్లలం, దేవుని యింటివారంగా విశ్వాసం ద్వారా బాప్తిస్మం పొందినప్పుడు అయ్యాం (గలతీ. 3:26, 27). పిల్లలంగా, దేవుని వారసులం మరియు క్రీస్తుతో సహవారసులం (రోమా 8:17; గలతీ. 4:7). వారసులంగా మన నివాసం పరలోకంలో ఉంది (1 పేతురు 1:3, 4).

తీర్పు దేవుని యింటి వద్ద ఆరంభమౌతుంది! వీరు సువార్తకు విధేయులైనవారు. వీరికిని సువార్తకు లోబడనివారికిని మధ్యగల తారతమ్యాన్ని పేతురు చూపాడు (1 పేతురు 4:17). సువార్త రక్షించడానికి దేవుని శక్తి (రోమా 1:16), అంటే, దేవుని యింటివారు, సంఘము రక్షింపబడినవారైయున్నారు. మనం సువార్తకు లోబడనివారమైనట్లయితే, ''ఆయన సముఖము నుండియు ఆయన ప్రభావమందలి మహిమనుండి పారదోలబడి, నిత్యనాశనమను దండన''

పొందుతాం (2 థెస్స. 1:9).

సంఘము ''మంద'' అని పిలువబడింది (అపొ. 20:28). ప్రభువైన యేసు తన గొర్రెలకొరకు తన ప్రాణాన్ని పెట్టాడు (యోహాను 10:11, 15). ఆయన గొర్రెలుగా, మనం ఆయనకు లోబరచుకొంటాం (యోహాను 10:27; ఎఫెసీ. 5:24 ). ఆయనను మనం వెంబడిస్తాం గనుక ఆయన మనకు నిత్య జీవమిస్తాడు (యోహాను 10:27, 28). ప్రకృతి సంబంధమైన లోకంలో, గొర్రెలు మందలోనికి జన్మిస్తాయి; అలాగే, ఆత్మ సంబంధమైన పరిధిలో, క్రీస్తు యొక్క మందలో ఆత్మ సంబంధమైన జన్మ జరగడం అవసరం (యోహాను 3:3–5).

మనం ఎక్కడ ఉన్నామనేది పెద్ద తేడాను కలిగిస్తుంది. మనం క్రీస్తు యొక్క ఒక్క శరీరంలో, అంటే ఆయన సంఘంలో – కీస్తు రాజ్యం, దేవుని కుటుంబం, క్రీస్తు యొక్క మందలో లేకుంటే – మనం పరలోకంలో ప్రవేశించలేం. మన బాప్తిస్మమే సాధ్యమైన స్థానపు మార్పును జరిగించి క్రీస్తు సంఘములో మనలను ఉంచుతోంది.

## సేవకత్వపు మార్పు

బాప్తిస్మంలో ఆత్మ సంబంధమైన మన జోక్యం యొక్క ఫలితంగా పాపమునకు దాస్యం చేసే జీవితాన్ని విడిచిపెట్టి, నీతికి దాస్యం చేసే నూతన జీవితంలో మనం ప్రవేశిస్తాం (రోమా 6:16–18). పాపం మనలను లోబరచుకొని పాపమునకు దాసులనుగా చేస్తుంది (యోహాను 8:34; రోమా 6:16; 2 పేతురు 2:19). మనకు అప్పగింపబడిన ఉపదేశ క్రమమునకు హృదయ పూర్వకంగా లోబడక పోయినట్లయితే (రోమా 6:17, 18), మనం పాప దాస్యంలోనే ఉండిపోతాం. ఆత్మ సంబంధంగా క్రీస్తుతో కూడ బాప్తిస్మమందు మనం చనిపోయినప్పుడే మార్పు జరుగుతుంది (రోమా 6:3, 4). ఆ బిందువు వద్ద పాత జీవితము సిలువవేయబడుతుంది, పాప శరీరము నిరర్థకం చేయబడుతుంది, మరియు మనము పాపమునకు యిక దాసులము కాము (రోమా 6:4–6). బాప్తిస్మమందు మనం పాపం విషయమై చనిపోవడం ద్వారా, చెలామణి చేసే పాపము యొక్క శక్తినుండి మనం విడిపింపబడతాం (రోమా 6:7, 18).

## బాంధవ్యముల మార్పు

మనం బాప్తిస్మం పొందినప్పుడు, మన బాంధవ్యాలు మార్పు చెందుతాయి. మనము బాప్తిస్మం పొంది క్రీస్తు యొక్క రాజ్యంలోనికి మార్చబడక ముందు, అంధకారంలోను, అపవాది యొక్క ఆధిపత్యంలోను ఉన్నాం (అపొ. 26:18; కొలస్సీ. 1:13). ఆలాగున మనం భావించకపోవచ్చు, మరియు దాన్ని మనం జరిగించినంతవరకు (యోహాను 8:44), మనం అపవాది పిల్లలమే (1 యోహాను 3:7, 8, 10). దుష్టుని సంబంధులంగా ఉన్న దానిలోనుండి, దేవుని పిల్లలగా ఉండేలా మన విశ్వాసం నడిపిస్తుంది (గలతీ. 3:26, 27).

రాజ్యపు కుమారులంగా, దుష్టుని పిల్లల మధ్య లోకంలో మనమింకను జీవిస్తునే ఉంటాం (మత్తయి 13:37–39). కోత కోయడానికి దేవదూతలు పంపబడినప్పుడు, రాజ్యపు కుమారులు దుష్టుని పిల్లలనుండి వేరు చేయబడతారు. తండ్రి రాజ్యంలోనికి ప్రవేశించడానికి బదులు, దుష్టుని సంబంధులు అగ్నిలో పడవేయబడతారు (మత్తయి 13:39–43).

మనం పాపం యొక్క అంధకారంలో ఉన్నట్లయితే, మనం దేవుని సహవాసంలో ఉండనేరం – ఎందుకంటే దేవుడు వెలుగైయున్నాడు, ఆయనలో చీకటి ఎంత మాత్రమును లేదు (1 యోహాను 1:5–7). పాపము దేవునినుండి మనలను వేరుచేసి, ఆయనతో సహవాసం లేకుండ చేస్తుంది (యెషయా 59:1, 2). క్రీస్తునకు వెలుపల ఉన్నవారు ఆయననుండి వేరుచేయబడినవారై ఉంటారు (ఎఫెసీ. 2:11, 12). బాప్తిస్మం పొంది మనం క్రీస్తులోనికి ప్రవేశించినప్పుడు (రోమా 6:3; గలతీ. 3:27), అంధకారంతో ఉండిన మన సంబంధం అంతరిస్తుంది, వెలుగుతో మన సంబంధం ఆరంభమౌతుంది. క్రీస్తుయేసునందు ఆయన రక్తంవలన మనం దేవుని యొద్దకు తేబడ్డాం (ఎఫెసీ. 2:13).

## సంగ్రహం

బాప్తిస్మం పొందడంలో ఉన్న మేళ్లను, దేవుడు ఎదురు చూచే ఆత్మ సంబంధమైన మార్పులను గ్రహించినప్పుడు, మనం బాప్తిస్మం పొందాలి. ఈ మార్పులు లేకుంటే, దేవుని రాజ్యంలోనికి ప్రవేశాన్ని ప్రసాదించే క్రొత్త జన్మను మనం పొందలేం (యోహాను 3:3–5).

### బాప్తిస్మం యొక్క భావం

జాన్ స్కాట్ యిలా వ్రాశాడు, ''దాని సందర్భంలో వేరుగా చెప్పకున్నట్టయితే, మొదటిగా, బాప్తిస్మమంటే నీటి బాప్తిస్మమే. ...అయితే 'బాప్తిస్మము' మరియు 'బాప్తిస్మము పొందు' అనే పదాలు ఎప్పుడు వచ్చినా, దేనిలోనికి బాప్తిస్మం జరుగుతుందనేది ప్రస్తావింపకుండ, ఆ సూచన నీటి బాప్తిస్మానికి సంబంధించిందని చెప్పడం క్షేమకరం. ఏదియెలాగున్నా, ఎప్పుడైనా నీటి బాప్తిస్మం అనేది ఉద్దేశింపక పోయినట్టయితే, దానికి మారుగానున్న బాప్తిస్మపు మూల పదార్థం ప్రస్తావించ బడుతుంది; ఉదాహరణకు, 'ఆత్మతో.' ''[1]

దీనితో ఆల్‌బ్రిచ్ ఓప్‌కె ఏకీభవిస్తున్నాడు: ''దాని సందర్భము వేరుగా చూపనట్లయితే బాప్తిస్మమనే క్రొత్త నిబంధనకు సంబంధించినది నీటి బాప్తిస్మంగానే తలంచాలి. బాప్తిస్మమంటే సాంకేతికంగా 'నీటిలో బాప్తిస్మ' మివ్వడమనేది అర్థం. అందువలన సాధనాన్ని ప్రత్యేకించి చెప్పడం అనవసరం.''[2]

---

సూచనలు

[1]John Stott, *Romans: God's Good News for the World* (Downers Grove, Ill.: InterVarsity Press, 1994), 173. [2]Albrecht Oepke, *"baptizo," Theological Dictionary of the New Testament*, vol. 1, ed. Gerhard Kittel, trans. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1964), 539.